**అంఅః**

**మ**ధుమూర్తి బ్రతకనేర్చినవాడు.

మధుమూర్తి అదృష్టవంతుడు.

మధుమూర్తికి లౌక్యం మనిషి సైకాలజీ బాగా తెల్సు.

మధుమూర్తికి వేలుపెట్టే సందుగాని దొరికితే మనిషి మొత్తం దూరిపోగలడు. మనవల్ల కానేకాదు.

ఇవన్నీ మధుమూర్తి గురించి అతడి కొలీగ్స్, బంధువులు, శ్రేయోభిలాషులు పబ్లిగ్గా, ప్రైవేటుగా వెలిబుచ్చే అభిప్రాయాలు.

అవన్నీ అసత్యాలు. కల్పితాలు కానే కావు. పచ్చి నిజాలు అనటానికి వాళ్ళందరి దగ్గర కావలసినన్ని దాఖలాలున్నాయి.

ఆఫీసులో చేరిన ఏడాదికే అతడు డైరక్టు కోటాలో ఆఫీసరయి కూర్చున్నాడు.

ఆఫీసులో కల్లోలం... కోలాహలం... కాడిడార్లలో గుసగుసలు...

ఎలా జరిగింది? ఏం చేసేడు? ఏదో చేసే వుంటాడు. వడ్డించే వాడు వాళ్ల కులం వాడేగా! ఓహో... అదా విషయం.

అతడు ఇల్లు కట్టినపుడు, స్కూటరు కొన్నప్పుడు. ఇద్దరు పిల్లల్ని ఖరీదైన కాన్వెంటులో చేర్చినపుడు. ఇంట్లో నామానుల్ని రంగరంగ వైభవంగా అమర్చుకున్నప్పుడు వీళ్ళంతా మళ్ళీ మళ్ళీ ఘట్టిగా అనుకున్నారు.... ఏదో చేస్తున్నాడు.

కాని ఓ విషయం అంతా ఏకగ్రీవంగా వొప్పుకుంటారు... మనందరి వద్ద లేనిదేదో అతడిలో ఉంది. కాని అదేవిటో మాత్రం వాళ్ళ కంతుబట్టటం లేదు.

తన గురించి ప్రజలేమనుకుంటున్నారో మధుమూర్తికి తెల్సు– అవన్నీ విన్నప్పుడు, గుర్తికొచ్చినపుడు ముచ్చటగా నవ్వుకుంటాడు.

తన వద్ద అతీత శుక్తులున్నాయని వాళ్ళ వుద్దేశం.

నిజానికి తనూ వాళ్ళందరిలాంటి వాడే. కాకపోతే తనకి ఎవరి పరిచయం కలిగినా ఆ వ్యక్తి తనకి ఏ విధంగా ఉపయోగపడగలడో ఆలోచించి ఆ విధంగా వాడుకుంటాడు. దీన్ని వాళ్ళంతా లౌక్యం అని మరోటని మరోటని పిల్చుకుంటారు కాబోలు.

మధుమూర్తి సన సన్నగా నవ్వుకున్నాడు.

వీళ్ళంతా గడ్డివామిదగ్గర కుక్కల్లాంటి వాళ్ళు. వాళ్ళు బాగుపడ్లేరు. ఇంకోడు బాగుపడితే చూడలేరు. రేపు తనకి, తను అనుకుంటున్నట్టు– ఆఫ్‌కోర్స్– ప్రయత్నిస్తున్నట్టు 'ఏ ఎమ్ డి' ప్రమోషనొస్తే వీళ్ళ మొహాలు ఎలా ఎలా వుంటాయో? ఎంత మందికి గుండెపోటులొస్తాయో?

తననడిగితే, వీళ్ళకి బ్రతకటం తెలీదంటాను. వృక్షశాస్త్రం. జంతుశాస్త్రం చదివి వాటిలాగే బ్రతకటం బాగా అలవాటు చేసుకున్నారు. కాని తను చదివింది మేథమేటిక్స్. కూడికలు. తీసివేతలు, భాగాహారాలు తన శరీరంలో ప్రతిఅణువునా వున్నాయ్. జీవితానికి, గణితానికి ఎంత సన్నిహిత సంబంధం ఉందో వీళ్ళకేం తెల్సు?

తనకి ప్రమోషన్ నిరంజనరావు చేతుల్లోంచి రావాలి.

ఇదీ ప్రాబ్లమ్.

దీన్ని సాల్వ్ చెయ్యటానికి ఏ ఏ ఫార్ములా ఉపయోగించాలో ఆలోచిస్తూ పోతే అర్థం అవుతుంది.

కులమా? కాదు. ఆయనది వేరే కులం.

మరి డబ్బా? డబ్బుమనిషి కాడట.... అంటే ఋషా? హరిశ్చంద్రుడా? ముక్కు సూటిగా పోయేవాడా?

కాదు. కాదు, మరేవిటి? అలవాట్లు బలహీనతలు....

నిరంజనరావు అంటే ఏవిటో కష్టపడి కనుకున్నాడు.

అతడిలోంచి ఎమ్‌డి హోదాని తీసివేసి, అతడి బలహీనతలతో భాగిస్తే మిగిలేది సాధారణ చవకబారు మనిషి. వాటిని తను దొడువుగా వాడుకోబోతున్నాడు.

అప్పుడు వీళ్ళంతా ఏదో చేసి ప్రమోషన్ కొట్టేసానని లోపల్లోపల భగ్గునమండి భోరున ఏడుస్తారు.

డోంట్ కేర్....గో.... ఎహెడ్... ఆల్‌ది బెస్ట్....

* * *

మధుమూర్తి స్ప్రింగ్ డోర్స్ నెట్టుకుని నిరంజనరావు ఛాంబర్లోకి వెళ్ళేడు.

లోపలికి అడుగు పెట్టగానే కూలర్‌లోంచి గాలి వెళ్ళున వొంటిని తాకి వుక్కిరిబిక్కిరి చేసింది. మెత్తటి కార్పెట్టు మీద కొద్ది క్షణాలు అలాగే నిల్చుండి పోయేడు.

నిరంజనరావు తలెత్తి చూసి చిరునవ్వు తోనే ప్రశ్నించాడు 'యస్. ప్లీజ్ సిడ్డౌన్"

మధుమూర్తి కుర్చీలో కూర్చున్నాడు.

నిరంజనరావు ఏమ్డీగా.. రాగానే అతడి దృష్టిలో పడటానికి ముధుమూర్తి చాలా ప్రయాసలుపడి ఎన్నో ప్రక్రియలు గూడా చేసేడు. కొత్త సంవత్సరం రోజు గ్రీటింగ్ కార్డు స్వయంగా ఇచ్చి అంతా మంచే జరగాలని ఆత్మీయుడిలా ఆకాంక్షించేడు. దీపావళి రోజున బాంబే హల్వానించి స్వీట్సు పట్టుకెళ్ళి అమ్మగారికిచ్చి తన పేరు మధుమూర్తని చెప్పి మరీ వచ్చాడు. ఏమ్డీగారి ఇంట్లో ఫ్రిజ్ పాడయిందని ఎవరిద్వారానో విని స్వయంగా వెళ్ళి దగ్గరుండి రిపేరు చేయించేడు.

ఇన్ని స్తోత్రాలు పాడి వ్రతాలు చేసేడు కాబట్టే నిరంజనరావంతటి ఆఫీసరు తన లాంటి చిన్న వుద్యోగిని 'ప్లీజ్ సిడ్డౌన్' అన్నాడు అనుకున్నాడు కుర్చీలోకూర్చుంటూ మధుమూర్తి.

వాళ్ళిద్దరి మధ్యా కాస్సేపు ఆఫీసుకబుర్లు నడిచాయ్. ఆ తర్వాత మధుమూర్తి అసలు విషయాన్ని కదిపాడు. 'సార్– మీరేం అనుకోకపోతే మీకో వెట్‌పార్టీ ఇవ్వాలను కుంటున్నాను. నా దగ్గర రాయల్ సెల్యూట్ బాటిలొకటి వుంది. మా రిలేషను ఒకతను ఆమెరికానించి వస్తూ తెచ్చాడు. ఒక సాయంత్రం మీరూ నేనూ...." మిగతా మాటలు నోట్లోనే వుంచేసుకుని ఆయన వంక చూసేడు.

నిరంజనరావు ఓ క్షణం ఆలోచించేడు.

ఇటు చూస్తే తన సబార్డినేట్– కల్సి తాగటం సభ్యత కాదు. తన హోదాకి తగిన పని కాదు. కాని అటుచూస్తే రాయల్ సెల్యూట్. క్లాస్ వన్ స్కాచ్. దాని పేరు వింటేనే రెండు చేతులూ ఎత్తి నమస్కారం పెడతారు మందు మహరాజులంతా. ఎన్నో ఏళ్ళుగా తనకోర్కె. ఆ స్కాచ్ త్రాగాలని నిర్ణయించుకోటానిక్కాసేపు పట్టింది ఆయనకి.

ఆ కొద్ది క్షణాలు మధుమూర్తికి చెప్పలేనంత ఆత్రుత, ఆదుర్దా తెచ్చిపెట్టినాయ్.

నిరంజనరావు కుర్చీలో వెనక్కి జారగిలపడి రిలాక్సవుతున్నట్లుగా కూర్చుని 'వెల్ థాంక్స్ ఎలాట్. కానీ నేనూ రెగ్యులర్ బూజర్నికాను, అడపాదడపా సర్దాగా ... ఇట్సాల్‌రైట్... మిమ్మల్ని డిజప్పాయింట్ చెయ్యటం నాకిష్టం లేదు. బైదిబై వెన్యూ ఎక్కడా?" క్యాజువల్గా అడిగాడు.

మధుమూర్తికి ప్రాణం వచ్చింది. ధైర్యం వచ్చింది.

"మా ఇంట్లోనే...అఫ్‌కోర్స్... మీరు సరేనంటే...

నిరంజనరావు నిజంగా ఆశ్చర్యపోయాడు. తన భార్య ససేమిరా ఇంట్లో తాగటానికి వీల్లేదనే విషయం గుర్తుకొచ్చి దేనికైనా పెట్టి పుట్టాలని ఆధ్యాత్మికంగా బాధపడి, పైకి మాత్రం . 'మీ వైఫ్ అబ్జక్టు చెయ్యరా." కుతూహలంగా అడిగేసాడు.

"నో ప్రాబ్లమ్. నా వైఫ్ చాలా కల్చర్డ ఎడ్వాన్స్‌డ్ టైపు. అయితే– రేపు ఆదివారం సాయంత్రం.... ఓ.కే. సార్?"

‘ఓ.కే... ఇట్సాల్‌రైట్’’

ముధుమూర్తి మేఘాలపైన తేలిపోతూ బయటికొచ్చేడు.

నీ నీ నీ

ఆమెకి పాతికేళ్ళ వయసుంటుంది.

ఎత్తుగా నాజూగ్గా, సొంపుగా, సొగసుగా వెరసి అందంగా ఉంది. మొహం కోలగానూ, కళ్ళు వెడల్పుగానూ వున్నాయ్. వీపు విశాలంగా వుంది. భుజాలు నునుపుగా, ఎదుర్రొమ్ములు నిండుగా, ఎత్తుగా వున్నాయ్ నడుంవద్ద ఒకటి రెండు ముడతలు, అదో అందంలాగా, అలంకారంలా వున్నాయి. మాటలు బెదురుగానూ, చూపులు దీనంగానూ వున్నాయ్.

మధుమూర్తి ఆమెను స్నాం చెయ్యమన్నాడు.

చేసింది

భార్యస్లీప్‌లెస్ జాకిట్టూ, పట్టుచీర తీసిచ్చి కట్టుకోమన్నాడు.

కట్టుకుంది.

పొడుగ్గా వాల్జెడ వేసుకుని మల్లెచెండు పెట్టుకోమన్నాడు.

పెట్టుకుంది.

సెంటు పూసుకుని స్ప్రేచల్లుకోమన్నాడు.పూసుకుంది! చల్లుకుంది.

సోషల్‌గా, ఫ్రీగా వుండి, ఆ పిల్చేవా డిని ప్లీజ్ చెయ్యాన్నాడు.

సరేనన్నది.

నువ్వు నా భార్యవని చెప్పమన్నాడు.

పేరు సుగుణని, పిల్లలేరంటే సెలవులకి బంధువులింటికి వెళ్ళారని చెప్పమన్నాడు.

మూస వేషాలకి అలవాటు పడిపోయిన నటీమణికి కొత్త తరహా పాత్ర లభించినట్లుగా అనిపించగా సరేనన్నది.

సరిగ్గా ఆరున్నరకి...

నిరంజనరావు దిగడ్డాడు. గ్లాస్కోపంచె కట్టి సిల్కులాల్చి వేసాడు. మెళ్ళో వున్న జిగినీ గొలుసు కనబడాలనో, లేక గుండెల పైని వెంట్రుకలు కనబడాలనో, లేక రెండూ కనబడాలనో గాని, లాల్చీ గుండీలు విప్పుకునే వచ్చేడు. చేతిలో త్రిబుల్‌ఫైవ్ ప్యాకెట్టుంది. పెదాలపై చిరునవ్వుంది. మనిషిలో ఆత్రం ఉంది.

మధుమూర్తి అతడ్ని సరాసరి పడగ్గదిలోకి పట్టుకెళ్ళేడు. అప్పటికే అక్కడ ఓ టీపాయ్, రెండు కుర్చీలు, షోడాలు, ఐసుక్యూబ్స్ వగైరా పూజా ద్రవ్యాలన్ని అమర్చబడున్నాయి.

నిరంజనరావు కూర్చుని గదిని పరీక్షగా చూస్తూండగా, మధుమూర్తి అల్మైరాలోంచి రాయల్ సెల్యూట్ బాటిలు తీసి ఆయన కందిస్తూ “విత్ లౌ రెండో ఎఫెక్షన్ సర్’’ అన్నాడు. నమ్రతగా.

గ్లాసుల్లోకి ద్రవం పారింది. షోడా కల్సింది. అయిసు ముక్కలు ఐక్యం అయిపోతున్నాయ్.

సరిగ్గా ఆమె అప్పుడొచ్చింది. రెండు చేతుల్లో రెండు పింగాణి ప్లేట్లున్నాయ్. ఒకదాంట్లో వేయించిన కాజూ, ఇంకోదాని లో పొగలు పొగలుగా ఆమ్లెట్.

వాటిని టీపాయ్‌పై వుంచింది.

‘సర్.. మీట్ మై వైఫ్ సుగుణ... వీరు మా ఎమ్.డి. నిరంజనరావుగారు... ఎఫిషియంట్ అండ్ ఎక్స్‌లెంట్ ఆఫీసరు...

మంచి మనిషి...

ఆమె రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేసింది. నిరంజనరావు మాత్రం ఒకచేత్తోనే విష్ చేశారు.

ఆమె వాళ్ళిద్దరికి సమదూరంలో మంచం పైన కూర్చుంది.

గ్లాసులు పైకి లేచినాయ్.

రాయల్ సెల్యూట్ గుటక చప్పుడు కాకుండా మత్తుగా, వగరుగా హాయిగా గొంతులోకి దిగుతోంది. నరాలు సంగీతం పాడుతున్నాయ్. నిరంజనరావు స్కాచ్ త్రాగుతూ, మాట్లాడుతూ, ఓరకంట ఆమెని, ఆమె అడ్డుగా ముడతపడ్డ నడుంని,

ఇంపుగా వున్న ఆమె భుజాన్ని, ఎత్తుగా కనిపిస్తున్న ఆమె ఎదురొమ్ముని చూస్తూ మూడుపన్లూ ముచ్చటగా చేసుకుపోతున్నారు. మధుమూర్తి మాట్లాడుతూ, ఇంకో ప్రక్క ఆయన్ని, హావభావాల్ని గమనిస్తున్నాడు.

ఆమెకి వాళ్ళు మాట్లాడుకునే మాటలేవీ అర్థం కాలేదు. నిజానికి విసుగనిపించింది. కాని తప్పదన్నట్లుగా చిరునవ్వుతో గ్లాసు ఖాళీ అయినపుడు నింపటం, షోడా కలపటం చేస్తోంది.

ఆమె వద్దనించి గ్లాసు అందుకుంటున్నప్పుడు ఆమె చెయ్యిని కావాలని తాకేరు. ఆమె అదోలా నవ్వింది. నిరంజనరావు గారి శరీరంలోని నరాలన్నీ జివ్వుమన్నాయి. రెండు కిస్తీల స్కాచ్ కడుపులో పడేసరికి మేనర్సేమిటి మీనింగ్ లెస్సని ఆమెవైపు నిర్భయంగా, సూటిగా, చురుగ్గా చూడసాగేరు.

వెర్రి చూపులు చూస్తున్నారే గాని, విషయం ఏమిటో అర్థం కాకుండా వుంది. అంతా సందిగ్ధంగానే చచ్చింది.

అంతలో మధుమూర్తి బిర్యానీ పార్సిలు చేయించుకొస్తానంటూ బయటికి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు ఆమెని చూసి కన్ను గీటేడు– హాండిల్ విత్ కేర్ సుమాన్నట్లుగా.

అతడెళ్ళిపోయాక ఆమె వెళ్ళి మధుమూర్తి ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుంది.

నిరంజనరావు నిటారుగా కాళ్ళు చాచి ఆమె కాలిని తాకి 'సారీ' అంటూ వెనక్కి తీసుకుంటూ "మధుమూర్తి ఈజ్ ఎ లక్కీమాన్' అన్నారు చూపుల్తోనే చుట్టేస్తూ.

ఆమె నవ్వి తలొంచుకుంది.

అయినా ఆయనల్లో సంధిగ్ధం అలానే ఏడ్చింది. ప్రొసీడవటమా లేక పెద్దమనిషిలా వుండిపోవటమాని నిషా ఎక్కిన బుర్రతో ఆలోచించచేరు. పది నిమిషాలు ఆమెని ప్రొబేషన్లో వుంచి తను టాయిలెట్‌కంటూ వెళ్ళారు. వస్తూవస్తూ అనుకోకుండా తూలిపడబోయి అనుకుని ఆమె భుజాన తూలి చెయ్యివేసి తమాయించుకు నిలబడ్డారు.

ఆమె ఓర్పుగా ఆయన్నిపట్టుకుని కుర్చీలో కూర్చోపెట్టింది.

బస్। ఆయనకది చాలు.ప్రొబేషన్ డిక్లేరు చేసేసుకున్నారు.

ఆమె స్పర్శతో నరాలు కాగిపోయి కాలి పోయేట్లున్నాయ్. ముక్కుపుటాల ద్వారా గాలి వెచ్చగా పొయ్యిలోంచి వస్తున్నట్లుగా వుంది. వొళ్ళు వెచ్చగా.... రోమాలు నిక్క బొడుచుకుని ... పొందు కోసం ప్రాణం రెపరెపలాడుతుండగా...

ఆయన ఇంకేమాత్రం తాళలేక గబుక్కున ఆమె నడుం చుట్టూ చెయ్యి చుట్టి ఆమె చెంపలకి తన చెంపని అనించి, మెల్లిమెల్లిగా నడుం పైన, చెయ్యిని గుండెల మధ్యకి తెచ్చి ఆవేశపడిపోతుండగా...

ఆమె చివాల్న లేచి నిల్చుంది...

నిరంజనరావుగారు కథ అడ్డం తిరిగిందాని వర్రీ అయ్యేరు.

కాని ఆమె అతడ్ని సూటిగా చూస్తూ, "నేను మీకుకావాల్నా?" అంటూ స్పష్టంగా తీక్షణంగా అడిగింది.

అంతటినిష్కర్షతని ఆయన భరించలేక పోయేరు. సూర్యుడ్ని సూటిగా చూడాల్సి వచ్చినట్లు ఫీలయ్యేరు. తను అవునంటే మరి మావారి ప్రమోషనుసంగతి గుర్తుంచుకుంటారా.' అంటుందని వూహించేసి, తన ముందు చూపుకి తనే ముచ్చటపడి, ముసి ముసిగా నవ్వుతూ 'ఏమిటి బేరమా?" అనడిగారు.

'త్వరగా చెప్పండి. మళ్ళీ ఆయనొస్తారు" అన్నది కంగారుగా.

నిరంజనరావు గారి కాక్షణంలో ఏమీ అర్థంకాక, అయోమయంగా కావాలన్నట్లుగా తలూపేరు.

"అయితే ఒక్కక్షణం" అంటూ ఆమెలోనికెళ్ళింది.

నిరంజనరావుగారు తృప్తిగా గాలి పీల్చుకున్నారు. కోర్కె పుట్టినచోట ఆ వ్యక్తికి ఆ మాటకాస్తా చెప్పేసినపుడు ఎంత తేలిగ్గా, హాయిగా వుంటుందో రావుగారి క్కూడా అంత తేలిగా, హాయిగా అనిపించగా మళ్ళీ గ్లాసులో స్కాచ్‌ని ఇంకో గుచంతాగి, మంక్కం పైన వెల్లకిలా పడుకునుండగా... ఆమె తిరిగి ఆ గదిలోకొచ్చింది.

కాని ఇప్పుడు పట్టుచీర లేదు. స్లీవ్‌లెస్ జాకిట్టూ లేదు. తల్లో మలెదండా లేదు.

నలిగిపోయి మూసిపోయిన పువ్వుల వాయిల్‌చీరె. నల్లబ్లౌజు... జడని చుట్టి ముడిగా వేసుకుంది...

ఆమె మంచం ప్రక్కన నిల్చుని పడుకునున్న రావుగారితో 'వంద రూపాయలవుతుంది వున్నాయా? అనడిగింది. అదే నిష్కర్ష. అదే ధోరణి.

ఆ మాట వినగానే రావుగారి లోపలున్న రాయల్ సెల్యూట్ ఆవిరిగా మారినట్లనిపించింది. సర్వేంద్రియాలు స్థంబించి సత్యాగ్రహం చేసాయ్ కాస్సేపు. ఆవిడేం అన్నది? తనేం విన్నాడు? ఆవిడ అనటం తప్పా? తను వినటం తప్పా? అతా కంగాళీ... గందరగోళం- కన్‌ఫ్యూజన్లోనే "వాడ్డూయూ మీన్?" నూతిలోపడిపోయి, అక్కడ్నించే పైనున్న వాడ్ని అడిగినట్లుగా అడిగారు.

ఆమె ఆయన మాట వినిపించుకోనట్లుగా, మంచం చివరగా కూర్చుని తలొంచుకుని 'నా పేరు సుగుణ కాదు. ఆ పేరు ఎవ్వరిదో నాకు తెలీదు. నేను ఈయనగారి భార్యను కాను! ఆ మాటకొస్తే ఎవ్వరి భార్యనూ కాను. అలాగని చెప్పమన్నారు. మూడొందలు ఇస్తానన్నారు. ఇంకా ఇవ్వలేదు. ఆయన భార్యగా కాస్సేపునటించి మిమ్మల్ని కుషీ చేయించమన్నారు. బహుశా పాపం ఆయన భార్యే వుంటే మూడొందలు మిగిలుండేవి కదా- భార్యగా నటనలోనే ఇంత నికృష్టం వుంటే నిజంగా ఎప్పటికైనా భార్యయితే ఇకెంత కుళ్ళు కుచ్చితం చూడాలో గదా? అదలా వుంచండి కేవలం నటనే గదా అనుకున్నాను- మీరేమో నా శరీరం కావాలంటున్నారు. మహరాజులా పుచ్చుకోండి. ఎంతోమంది ఇదే శరీరంతో ఆడుకున్నారు. ఆవేశపడ్డారు. ఆకళ్ళుచల్లార్చుకున్నారు. అలవాటయిన పనే. నా వొళ్ళు ఇంతమందిని రెచ్చగొట్టి ఆవేశపరుస్తోందంటే నాకెంతో గర్వంగా ఉంటుంది. చిన్న తనంలోనే 'అమ్మా ఆకలే అన్నం పెట్టవూ?' అనడిగితే మరి నాకో ముద్దిస్తావాని అమ్మ అడిగేది. అక్కడే, అప్పుడే, ఆ వయస్సులోనే నాకో సంగతి అర్థం అయింది. ఇచ్చి పుచ్చుకోవటంలోనే జీవన రహస్యం దాగుందని. అంచేత ఓ వంద రూపాయలు ఇప్పించండి. ఈయనగారికి మీతో ముఖ్యమైన పనుందని నాకర్థమైంది. ఇదిగూడా నాకు కొత్తంకాదు. కంట్రాక్టులు కావాలన్నాబిల్సు పాసవాలన్నా, వుద్యోగాలు కావాలన్నా మమ్మల్ని ఆటబొమ్మలుగా విసిరేసి పన్లు సాధించుకుంటుంటారు. కాని ఈయనేమో భార్య పేర్న ఇంకో ఆడదాన్ని ఎరగా వేసేడు. ఇదేం పద్ధతో నాకు తేలీదు. చదూకున్న గొప్పోళ్ళు మీకే తెలియాలి. మిమ్మల్ని చూస్తూంటే జాలేస్తోంది. ఎంత దొంగ బతుకులు బతుకుతారాని ఇంతకీ- ఏమంటారు? కావాల్నా?" మళ్ళీ అదే నిష్కర్ష... పెళుసు.

రావుగారు శవంలా బిగ్రబిగుసుకుపోయేరు. ఇంతసేపూ తను ముచ్చటపడి తాగింది విషం అయితే బాగుండుననిపించిది. భూమి వున్నపళంగా భళ్ళున విచ్చుకుని ఈ మంచంతో సహ దిగడిపోతే బావుండుగదానిపించింది. ఆకాశం వున్నపాటున మీదపడి దానిక్రింద నలిగిపోతే ఎంత ఆనందపడిపోనూ?

ఆమె మాటలన్ని విన్నాక తననెవరో పూర్తి నగ్నంగా నడివీధిలో నిల్చోపెట్టినట్లుగా ఫీలయ్యేరు.

ఆయన అతి ప్రయత్నం పైన మంచం పైనుంచి లేచి నిల్చున్నారు. కాని ఆమె వంక చూడలేకపోయేరు... జేబులోంచి పర్సుతీసి దానిలో నుండి కొంత డబ్బుతీసి ఆమెకివ్వబోయేరు.

'నా మాటలన్నీ విని జాలిపడి ధర్మం ఇస్తున్నారా? కాని నేను బిచ్చగత్తెను కాను బాబూ- రోగాలతో నావళ్ళు కుళ్ళిపోయి, విచ్చిపోయి ఈవొళ్ళు అన్నంపెట్టలేనపుడు నన్ను అనుభవించిన వాళ్ళందరి ఇళ్లకి వెళ్ళి బాబూ ఆకలంటే వాళ్ళు గుర్తుకు తెచ్చుకుని, పట్టెడన్నం పనిమనిషి చేత పెట్టించినా ఆళ్ళకోసం ఆ దేవుడ్ని నేమొక్కుతాబాబూ. కాని ఆ రోజు గూడా మీ ఇంటి

ముందుకు రాలేను. మీరు నన్ను ముట్టుకోలేదు గనక" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గొంతుక్కేదో అడ్డుపడింది.

రావుగారికి శరీరంలో ఏ మూలనో నిప్పంటుకునుంది. మెల్లిమెల్లిగా వొళ్ళంతా వ్యాపిస్తున్నట్లుగా అనిపించసాగింది.

ఇది ధర్మం కాదు. అతడు నీకిచ్చేది నటనకి. కాని నేనిస్తున్నది నీ నిజాయితీకి, నిర్భయత్వానకి...నిజంగా మేమంతా దొగలం. మేకవన్నె పులులం. ముసుగు వీరులం. రెండు నాల్కలు. రెండు నీతులు, రెండు వ్యక్తిత్వాలు.... నువ్వు శరీరాన్నే అమ్ముకున్నావ్. కాని మేం అన్నీ– మనసులు, మమతలు, ప్రేమలు, ఆప్యాయతలు, అన్నిటిని అమ్మేసుకుని, రసికారే పుళ్లు కనబడకుండా కాశ్మీరు శాలువా కప్పేసుకుని

ఎదుటివాడి చెమటపొక్కుల్ని చూసి ఎగతాళీ చేసే పెద్దమనుషులం నాకేవిటోగా వుంది. ఎక్కువ మాట్లాడలేను. ఇదిగో డబ్బు ఇది నా విజిటింగ్ కార్డ్... మళ్ళీ తప్పకుండా కలు"... అనేసి డబ్బుని, కార్డుని, ఆమె చేతిలో వుంచేసి తూలుకుంటూ వెళ్ళిపోయేడు.

ఆయన వెళ్ళిన పది నిమిషాలకి మధుమూర్తి బిర్యానీ పొట్లాలతో వచ్చేడు..."వెళ్ళిపోయేరా? ఎందుకని అనడిగాడు.

'ఏమో. తెలీదు!"

వాడిన ఆమె మొహం వంక, నలిగిన బట్టల వంక, రేగిన జుట్టువంక చూసి తృప్తిగా నిట్టూర్చేడు.

ఆమె డబ్బులు తీసుకు వెళ్ళిపోయింది. సరిగ్గా ఓ వారంరోజుల తర్వాత.

నిరంజనరావు కబురుపెట్టి మధుమూర్తిని పిలిపించేడు.

అతడు హుషారుగా లోనికెళ్ళాడు.

"ఆ రోజు పార్టీకి థాంక్స్ చెప్పటం మరిచాను. ఎక్సలెంట్ అరేంజ్‌మెంట్ అండ్ ఫెంటాస్టిక్ లిక్కర్ ఎనీవే థాంక్స్. ఇంకో సంగతి. మీ మిసెస్‌కి వుద్యోగం కావాలంటే అడగొచ్చుగా, నే కాదంటానా? ఆవిడచేత అడిగించాలా? ఆఫ్టాల్ ఇటీజెస్మాల్ మేటర్. ఆర్డర్సు ఇష్యూ అవుతున్నాయ్. వెంటనే జాయినవ్వమను...."

మధుమూర్తికి గిర్రున తన తల తిరిగిందా లే బిల్డింగ్ మొత్తం తిరిగిందా అర్థం కాలేదు. తన లెక్క ఎక్కడ తప్పిందో గూడా అర్థం కాలేదు.

ఆ సాయంత్రానికల్లా ఆఫీసంతా గుప్పుమన్నది 'ఏం చేసాడోగాని పెళ్ళాని గ్గూడా వుద్యోగం కొట్టేసాడు"

నెల రోజుల్లోపలే మధుమూర్తి రాజీనామా చేసేడు.

'ఏదో వుంది.... ఏదో చేస్తున్నాడు" అతడి గురించి అనుకుంటూనే వున్నారు ఆ ఆఫీసు స్టాఫు.